క్లుప్తంగా

అయోధ్యకు సీనియర్ సిటిజన్లు



అయోధ్యకు పయనమైన సీనియర్ సిటిజన్లతో సొసైటీ చైర్‌పర్సన్ లక్ష్మి

మురళీనగర్: మురళీనగర్ జ్యోతిర్మయి సొసైటీ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే సీనియర్ సిటిజన్లు మణిభూషణ్, బుచ్చిబాబు, అన్నాజీరావు కోరిక మేరకు సొసైటీ చైర్‌పర్సన్ జి.లక్ష్మి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యుల సమేతంగా అయోధ్య సందర్శనకు బయలు దేరారు. పెద్దల కోరిక తీర్చడం పిల్లల బాధ్యతగా భావించి ఇలా ప్రతి ఏడాది తీర్థ స్థలాలకు తీసుకుని వెళ్తున్నట్లు లక్ష్మి తెలిపారు.

వృద్ధులకు వితరణ



వృద్ధురాళ్లకు తువ్వాళ్లు, పండ్లు అందిస్తున్న పల్లా చంద్రమౌళి, క్లబ్ సభ్యులు

మురళీనగర్: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌లోని బంగారు తల్లి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వృద్ధులకు తువ్వాళ్లు, పండ్లు పంపిణీ చేశారు. తువ్వాళ్లు కొనుగోలుకు వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం ఆర్థిక సాయం అందించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, జాలీ వాకర్ ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.నాగేశ్వరరావు, బి.సూర్యనారాయణ, సబ్బినేని రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

కేవీ విద్యార్థుల ర్యాలీ



విశాఖ రైల్వేస్టేషన్‌లో ర్యాలీ చేస్తున్న కేవీ వాల్తేర్ స్కౌట్స్ అండ్ గైడ్స్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో కేంద్ర రైల్వే, టెక్స్‌టైల్స్ శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్ భాగస్వాములైన ఒక గంట శ్రమదాన కార్యక్రమంలో తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయానికి చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు కేంద్ర మంత్రికి తమ బ్యాండ్‌తో స్వాగతం పలికారు. అనంతరం స్కౌట్ మాస్టర్ ఎం.మణిబాబు ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా అభియాన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తమ సందేశాన్నిచ్చారు. కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, పీటీ మాస్టర్ రియాజ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం



చిత్తూరు హనీషా

మల్కాపురం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 ఏళ్ల విద్యార్థిని అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చిత్తూరు హనీషా అనే బాలిక వన్ టౌన్ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తోంది. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల 30న శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో సోదరుడు ఆమెను కాలేజీ వద్ద డ్రాప్ చేశాడు. కాలేజీ వదిలే సమయం సాయంత్రం సుమారు 4.30 గంటలకు అక్కడికి వచ్చి వేచి ఉండగా.. ఎంతసేపటికి సోదరి రాలేదు. అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం హనీషా తల్లి చిత్తూరు లక్ష్మి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలిసికట్టుగా శ్రమదానం

- ఏక్ తారీఖ్ – ఏక్ ఘంటా శ్రమదాన్‌కు విశేష స్పందన
- స్వచ్ఛందంగా రోడ్లు, పరిసరాల పరిశుభ్రత



సీతంపేటలో శ్రమదానం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



హిల్‌వ్యూ పార్కు వద్ద శుభ్రం చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతంపేట: జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏక్ తారీక్ – ఏక్ ఘంటా శ్రమదాన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిసికట్టుగా స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శ్రమదానం చేశారు. 25వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించారు. సీతంపేట జంక్షన్, కృష్ణుడి గుడి, శాంతిపురం ప్రసాద్ డాక్టర్ ఆస్పత్రి ప్రాంతాల్లో శ్రమదానం చేసి రహదారులను శుభ్రపరచి చెత్తను తరలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సింహాచలం నాయుడు, సచివాలయం సెక్రటరీలు, శానిటేషన్ సిబ్బంది లక్ష్మణ రెడ్డి, హరికృష్ణ, వినోద్, వాసు, అనూరాధ, నాగరాజు, సారిపిల్లి సంతోష్, రాము, ఈశ్వరరావు, గౌరినాయుడు, అప్పన్న, అప్పలరాజు, వలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

నరసింహనగర్ రైతుబజార్‌లో..

నరసింహనగర్ రైతుబజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులు, డ్వాక్రా వ్యాపారులు శ్రమదానం చేశారు. బజారులోని స్టాల్స్, పరిసరాలను శుభ్రం చేసి వ్యర్థాలను తరలించారు.

43వ వార్డులో..

జీవీఎంసీ 43వ వార్డులో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పాల్గొన్నారు. 80 ఫీట్ రోడ్, నందగిరినగర్, శ్రీనివాస నగర్ ప్రాంతాల్లో జీవీఎంసీ శానిటేషన్ సిబ్బందితో కలిసి రహదారులు ఊడ్చారు. చెత్త తరలించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

స్వచ్ఛతలో విశాఖ మేటి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని హిల్‌వ్యూ పార్కు వద్ద ప్రాంతాల్లో కార్పొరేటర్ కళారి అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆదరణ, అమూల్య సహాయ, సహకారాలతో జాతీయ స్థాయిలో స్వచ్ఛ నగరంగా ముందుకు సాగుతూ 4వ స్థానంతోపాటు టాప్ ఇంపాక్ట్ క్రియేటర్ సిటీగా విశాఖ నిలిచిందన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఆళ్ల శివగణేష్, కిరణ్‌రాజు, ఎం.సునీల్, జి.ప్రసాద్, కె.చిన్నా, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



నరసింహనగర్ రైతుబజార్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది, రైతులు



50వ వార్డులో చీపురుతో రోడ్డు ఊడుస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తదితరులు

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలో కార్పొరేటర్ కంపా హనోకు సూచనల మేరకు రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ముందుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. తాటిచెట్లపాలెం, తారకరామానగర్ గ్రీన్ బెల్ట్ పరిసరాల్లో క్లీన్లీనెస్ డ్రైవ్ చేపట్టారు. శానిటరీ, సచివాలయాల సిబ్బంది, నాయకులు కారుకొండ రాజు, నేపాల్ శ్రీను, సత్యానందం రెడ్డి, బాబూరావు, గణపతి, శ్యామ్, సువర్ణ, తవుడమ్మ పాల్గొన్నారు.

47వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్, బాపూజీనగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంటిపాము కామేశ్వరి శ్రమదానాన్ని ప్రారంభించారు. కొండవాలు ప్రాంతాలను శుభ్రం చేసినట్లు ఆమె తెలిపారు. ప్రత్యేక అధికారి వాటర్ సప్లై ఏఈ మోహన్, సీవో సూరిబాబు, అప్పారావు, రాఘవులు, కనకరాజు, సురేష్, గురువోజీ, రమేష్, పారిశుధ్య సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

49వ వార్డులో..

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు మురళీనగర్‌లోని బర్మా కాలనీ, నెహ్రూనగర్, మాణిక్యాంబ కాలనీ ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, వలంటీర్లు పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వారు స్వచ్ఛతా హీ సేవ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో భట్రాజ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, మహిళా నాయకురాలు బోశెం సరస్వతి, బి.శకుంతల, మంగ, శివరామప్రసాద్, ఎస్.చంద్రశేఖర్, ఢిల్లీరావు, కిషోర్, శంకర్ పాల్గొన్నారు.

50, 51, 53 వార్డుల్లో..

మల్కాపురం: జీవీఎంసీ 53వ వార్డు ఎఫ్‌సీఐ నగర్‌లోని ఎఫ్‌సీఐ పార్కులో కార్పొరేటర్ బర్కత్ అలీ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డితో కలిసి శ్రమదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భాస్కర్ గార్డెన్స్, హుస్సేన్‌నగర్ తదితర బహిరంగ ప్రదేశాల్లో శుభ్రత చర్యలు చేపట్టారు. ఏక్ ఘంటా స్వచ్ఛతా అంటూ ర్యాలీ చేశారు. ఆయా ప్రాంతాల్లో చెత్తను చీపుర్లు పట్టుకుని ఊడ్చారు. కార్యక్రమంలో సుశీల, హనుమంతు, జ్ఞానేష్, జయలక్ష్మి, భాను, నబీ, వలీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- 50వ వార్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పలు పార్కులు, బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ ప్లేస్‌లు తదితర ప్రాంతాల్లో క్లీన్లీనెస్ డ్రైవ్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, పార్టీ నాయకులు బగాతి విజయ్‌కుమార్, పప్పల సునీత, పైడి కృష్ణారావు మాస్టర్, సనపల నారాయణస్వామి, పొన్నాడ అప్పారావు మాస్టర్, ఎం.లక్ష్మి, ఏవీఎస్ రాజు, శ్రీనివాసరాజు, ఎం.వి.రెడ్డి, టి.ఎస్.రెడ్డి, సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య సభ్యులు, మాధవధార కళింగ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మాధవధార మహిళా వాకర్ సభ్యులు పాల్గొన్నారు.
- 51వ వార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. కళింగ నగర్, ఈస్ట్ పార్కులో పార్టీ నాయకులు కార్పొరేటర్‌తో కలిసి రోడ్లు, పరిసరాలను శుభ్రం చేశారు.



ఈస్ట్ పార్కులో శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తదితరులు



45వ వార్డులో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది



రాంజీ ఎస్టేట్‌లో చీపుర్లతో రోడ్డు ఊడ్చుతున్న కార్పొరేటర్ కామేశ్వరి, అధికారులు



శ్రమదానం ర్యాలీలో పాల్గొన్న 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ తదితరులు



మాణిక్యాంబ కాలనీలో స్వచ్ఛతా ప్రమాణం చేస్తున్న నాయకులు, పారిశుధ్య సిబ్బంది

ప్రజా సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రి దర్శనా జర్దోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశీర్వాదం, కాలనీల పెద్దలు

తాటిచెట్లపాలెం: రైల్వే ట్రాక్ పక్కన గల కాలనీలవాసుల సమస్యలపై కేంద్ర రైల్వే, టెక్స్‌టైల్స్ శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్‌కు ఆదివారం ఆయా కాలనీల పెద్దలు వినతిపత్రం అందజేశారు. దయానందనగర్, ముత్యమాంబ కాలనీ, రాజీవ్ కాలనీల్లో ఉంటున్న సుమారు 1500 కుటుంబాలకు సరైన రహదారి లేదని, ఇక్కడి నివాసులు వారి దైనందిన కార్యకలాపాల కోసం, అత్యవసర పరిస్థితుల్లోనూ రైల్వే ట్రాక్‌ను దాటాల్సి వస్తోందని వివరించారు. ఈ కారణంగా తమ ప్రాంతాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, అండర్ పాత్‌వే నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని మంత్రిని కోరారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు, పూజారి ఆశీర్వాదం పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో 'స్వచ్ఛ భారత్'



రైతుబజార్‌లో చెత్తను తొలగిస్తున్న ఈవో కొండబాబు, రైతులు

సీతమ్మధార: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుడ్ల సత్యారెడ్డి, బజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొని రైతుబజార్‌లో చెత్తను తొలగించి శుభ్రం చేశారు.

బియ్యం, కందిపప్పు స్పెషల్ కౌంటర్‌లో తనిఖీలు

సీతమ్మధార: ప్రభుత్వ ఆదేశాలతో రాయితీపై అందిస్తున్న బియ్యం, కందిపప్పుపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌లోని ప్రత్యేక కౌంటర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులు చెకింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, అప్పారావు తనిఖీలు నిర్వహించారు. కందిపప్పు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. కాటాలు తనిఖీ చేశారు. వాటిని కొనుగోలు చేసిన వినియోగదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం



మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నాయుడు

మురళీనగర్: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుందామంటూ వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ప్రెసిడెంట్ డాక్టర్ డి.డి.నాయుడు పిలుపునిచ్చారు. మురళీనగర్ జయరామ ఫంక్షన్ హాల్లో స్థానిక వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ ఆధ్వర్యంలో వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అధ్యక్షతన ఆదివారం డిస్ట్రిక్ట్-101 నాలుగో క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. విశాఖ ఉమ్మడి జిల్లాలు, శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి వాకర్స్ క్లబ్‌ల ప్రధాన బాధ్యులు, మహిళా వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రజల్లో నిరంతరం ఆరోగ్య స్పృహను కల్పించడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తారన్నారు. శుభ మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు సమన్వయంతో పనిచేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు వారి ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. ఎంజీఎఫ్ సభ్యులు, పూర్వ క్లబ్ అధ్యక్షులు, పూర్వ గవర్నర్లు, ఇతర పెద్దలను ఘనంగా సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సేలం ఐజక్, అడిషనల్ సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, ఇమ్మీడియట్ పాస్ట్ గవర్నర్ వాకర్ డాక్టర్ నండూరి రామకృష్ణ, ఏఎహెచ్ఎస్ వెంకటరావు, ఎ.లక్ష్మీరెడ్డి, ఎలెక్ట్ గవర్నర్ టి.రంగారావు, క్యాబినెట్ సెక్రటరీ సిహెచ్.జ్యోతి, కోశాధికారి మహాలక్ష్మి, బులిటెన్ ఎడిటర్ సిహెచ్.పద్మావతి, క్యాబినెట్ ఉప కార్యదర్శి జయ, సిహెచ్.అప్పారావు, వై.వి.అప్పారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బేడ్, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎస్.రోజారాణి, కోశాధికారి జి.షీలారాణి పాల్గొన్నారు.

నవ్వులు పూయించిన కామెడీ షో



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ హ్యూమర్ క్లబ్ సభ్యులు, క్రియేటివ్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ రత్న కామెడీ, హాస్య ప్రియ, హాస్య దర్బారు క్లబ్ సభ్యులు కామెడీ స్కిట్లు ప్రదర్శించి ప్రేక్షకులను నవ్వించారు. వీటిలో లాయర్ పరాంకుశం, బట్టల షాపు, పేకాట రాదన్నావు, కవితల ఆవిష్కరణ, మూడు మాత్రలు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. కళాకారులు జబర్దస్త్ ప్రకాశ్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, నాయుడు, పుష్పమి, అనూరాధ, కుమారి, పోర్టు శేషు, శ్రీధర్ ప్రదర్శించిన కామెడీ స్కిట్లు నవ్వులు పూయించాయి. అనంతరం యువ నాటకోత్సవాల్లో ముళ్లతేగలు, ఇంతింతే నాటకాలు ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు.

హద్దు మీరితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి రోజూ రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎవరి పనుల్లో వారు ఉండాలని, ఎక్కడ పనిచేస్తున్నారో వివరాలు తెలియపరచాలన్నారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

మంచిగా మెలగండి

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సీఐ విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి గొడవలు చేయకుండా బుద్ధిగా మెలగాలని సూచించారు. మద్యం తాగి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు ప్రతి రోజు ఎక్కడికి వెళ్లినా.. సమాచారం ఇవ్వాలన్నారు.

చురుగ్గా పింఛన్, రేషన్ పంపిణీ



51 వార్డులో లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న రెయ్యి వెంకటరమణ



నందగిరినగర్‌లో రేషన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఠంచన్‌గా అమలవుతున్నాయని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ, వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచే ప్రారంభమయ్యాయి. వాహనాలతో ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు రేషన్ సరకులు అందజేశారు. నందగిరినగర్, అక్కయ్యపాలెం, అబిద్‌నగర్ ప్రాంతాల్లో రేషన్ పంపిణీ చురుగ్గా జరిగింది. సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.

51వ వార్డులో..

మల్కాపురం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ 286 సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు రూ.2,750 పింఛన్ నగదును వలంటీర్‌తో కలిసి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అందజేశారు.

జోన్-5లో 89 శాతం పూర్తి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో తొలి రోజు సుమారు 89 శాతం వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లోని 24 వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో ఆదివారం వలంటీర్లు ఆయా లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారన్నారు. జోన్ పరిధిలో మొత్తం 26,929 మంది లబ్ధిదారులకు గానూ 24,059 మందికి ఇళ్ల వద్ద సచివాలయ కార్యదర్శుల సమక్షంలో వలంటీర్లు పింఛన్ డబ్బులు అందించినట్లు చెప్పారు. సోమవారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్-5 ఏపీడీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

భర్తపై ఫిర్యాదు

మల్కాపురం: శారీరికంగా, మానసికంగా తన భర్త వేధిస్తున్నాడంటూ ఓ వివాహిత కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు తెలిపిన వివరాలిలా.. దాసరి హిమబిందు అనే వివాహిత ఓల్డ్ ఐటీఐ జంక్షన్ దరి సిద్ధార్థనగర్‌లో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తోంది. గత నెల 30వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చిన భర్త తనను కొట్టాడని, తలపై ఎడమవైపు గాయాలయ్యాయని, ఇంట్లో నుంచి వెళ్లిపోమని వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. తరచూ ఇలా వేధిస్తుండటంతో ఆదివారం ఆమె చేసిన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్ధం కేసు దర్యాప్తు చేపట్టారు.

జోరుగా 'ఆరోగ్య సురక్ష' సర్వే



సీతంపేటలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



సాయినగర్‌లో సుగర్ టెస్ట్ చేస్తున్న ఏఎన్ఎం

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమైంది. సీతంపేట, మధురానగర్ సచివాలయ ప్రాంతాల్లో ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, వలంటీర్ ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. బీపీ, సుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు, నమోదు చేసుకుని ఆరోగ్య శిబిరాల్లో ఉచితంగా చికిత్స పొందేందుకు టోకెన్లు అందజేశారు. సచివాలయ అడ్మిన్ లక్ష్మణ్, ఏఎన్ఎంలు కె.కృష్ణవేణి, దివ్య, ఆశా కార్యకర్త త్రివేణి పాల్గొన్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 53వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జోరుగా సాగుతోంది. 300 సచివాలయం పరిధి సాయినగర్-5లో కార్పొరేటర్ బర్కత్ అలీ పర్యవేక్షణలో ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు, సర్వే చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నాయుడు వీధిలో అన్నదానం

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు నాయుడు వీధిలో సింహాద్రి అప్పన్న గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఒమ్మి అనిల్‌కుమార్, ఒమ్మి రవి, కోన వంశీ, సారిపిల్లి రాజ్‌కుమార్, సారిపిల్లి సాయికుమార్, ఒమ్మి వినోద్ కుమార్, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

షాడోగ్రఫీపై పిల్లలకు శిక్షణ



వర్చువల్ సెషన్ ద్వారా పిల్లలకు షాడోగ్రఫీలో టెక్నిక్స్ నేర్పుతున్న రేఖావ్యాస్

సీతంపేట: ముంబైకి చెందిన షాడో గ్రాఫిస్ట్ రేఖా వ్యాస్ వర్చువల్ సెషన్ ద్వారా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం మియావాకీలో పిల్లలకు హ్యాండ్ షాడోగ్రఫీని నేర్పించారు. చాలా మందికి కథలు చదవడం, వినడం ఇష్టపడతారని, పప్పెట్ షో, షాడోగ్రఫీతో కథలు చెప్పినపుడు ఆనందం రెట్టింపవుతుందని ఆమె అన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పిల్లల్లో వినోదం, సృజనాత్మకత కల్పనను రేకెత్తిస్తాయని, పఠనాశక్తిని, పుస్తకాలపై ప్రేమను కలిగిస్తాయన్నారు. రేఖా వ్యాస్ ఇంటరాక్షన్ విద్యార్థులను ఎంతగానో ఆకర్షించి షాడోగ్రఫీలో లీనమయ్యేలా చేసింది. షాడోగ్రఫీతో ఎలా కథలు చెప్పాలి, దానికి సంబంధించిన ఉపాయాలు, టెక్నిక్స్, కొన్ని రకాల హ్యాండ్ షాడోలు ఎలా తయారు చేయాలో పిల్లలకు నేర్పించారు.